క్లుప్తంగా

తహసీల్దార్ల నియామకం



ప్రసాద్



లచ్చాపాత్రుడు

గూడెంకొత్తవీధి: జీకే వీధి మండల తహసీల్దార్‌గా ఎస్.ఎల్.వి.ప్రసాద్ నియమితులయ్యారు. ఈయన చింతపల్లి తహసీల్దార్‌గా పనిచేశారు. ఇప్పటివరకు గూడెంకొత్తవీధి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు చింతపల్లి డీటీగా బదిలీ అయ్యింది.
చింతపల్లి: చింతపల్లి తహసీల్దార్‌గా పి.లచ్చాపాత్రుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతగిరి డీటీగా పనిచేస్తున్న లచ్చాపాత్రుడును ఇక్కడ పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా పనిచేసిన జీకే వీధి తహసీల్దార్ ప్రసాద్‌ను జీ.కె.విధి మండలానికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ మాసాడ గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం శనివారం సందర్శించారు. గ్రామంలో శివాలయం నిర్మించేందుకు ఏర్పాటుచేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం



కోలాట ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అడ్డతీగల: చవిటిదిబ్బలుకు చెందిన వినాయక గంగా కోలాట బృందం శనివారం చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఈ బృందం తొలి ప్రదర్శన పవనగిరి క్షేత్రంలో వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఎదుట శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులను బృంద సభ్యులు సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ ప్రాముఖ్యతను ప్రజలకు కోలాట ప్రదర్శన ద్వారా తెలియజేయాలని వారు కోరారు.

ఎంపీడీవోగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓ రవికిషోర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామ సచివాలయాల సిబ్బంది

వై.రామవరం: వై.రామవరం మండల పరిషత్ ఎంపీడీఓగా రవికిషోర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కడప జిల్లా నుంచి ఎంపీడీవోగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన గంగవరం ఎంపీడీవో బి.శ్రీనివాసులు తిరిగి తమ స్థానంలోకి వెళ్లారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి, కార్యాలయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ రవికిషోర్‌ను మండల సచివాలయ సిబ్బంది, సంఘ నేతలు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. సచివాలయాలు, సిబ్బంది వివరాలను ఆయనకు అందించారు. ఈకార్యక్రమంలో మండల సచివాలయాల సంఘ అధ్యక్షురాలు ఆర్.లోవకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసుదొర, సంఘ సభ్యులు ప్రశన్నకుమారి, సౌమ్య, మౌనిక, విఘ్నేష్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వై.రామవరం: కాకినాడ జిల్లా రౌతులపూడి మండల పరిషత్ అధ్యక్షురాలు (ఎంపీపీ) విజయలక్ష్మీపై దాడి చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అల్లూరి జిల్లా, రంపచోడవరం డివిజన్, వై.రామవరం ఎంపీపీ కడబాల ఆనందరావు కోరారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీపీ విజయలక్ష్మీపై చేసిన దాడిని శనివారం ఆయన ఒక ప్రకటన ద్వారా ఖండించారు. మహిళా ప్రజాప్రతినిధిపై ఇటువంటి దాడి చేయడం బాధాకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ఉల్లంఘనపై అడిగినందుకు దాడి చేయడం దారుణమని, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆనందరావు కోరారు.

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం

- 'జగనన్న ఆణిముత్యాలు'కు ఘన సత్కారం, నగదు, సర్టిఫికెట్ల పంపిణీ

చింతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తున్నారని ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా చింతూరు మండలం కంసులూరులో శనివారం ఆయన పదో తరగతి ర్యాంకర్లకు నగదు బహుమతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతోందని, ఫలితంగా ఉన్నత ఫలితాలు వస్తున్నాయన్నారు. పది ర్యాంకర్లు సౌందర్య, కళ్యాణి, భానుకు నగదు బహుమతులు అందజేశారు. ఉప సర్పంచ్ విప్లవ్‌కుమార్, విద్యాకమిటీ చైర్మన్ దొర, హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.
రాజవొమ్మంగి: పదవ తరగతిలో ఉత్తమప్రతిభ కనపరచిన రాజవొమ్మంగి జెడ్పీ పాఠశాల విద్యార్థి మిరాయల చరణ్‌తేజను శనివారం పాడేరులో జరిగిన ఆణిముత్యాలు కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ సత్కరించారు. విద్యార్థికి అవార్డుతో పాటు నగదు అందజేశారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎంపీ మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ చేతులమీదుగా ఆణిముత్యాలు అవార్డు అందుకుంటున్న చరణ్‌తేజ్, చిత్రంలో విద్యార్థి తండ్రి మునీశ్వరరావు

తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా నిలిచి..
సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన చరణ్‌తేజ కుటుంబం రొట్టెల తయారుచేసి విక్రయిస్తుంటారు. తల్లిదండ్రులు అచ్యుతమని, మునీశ్వరరావులకు రొట్టెల తయారీ, విక్రయాల్లో చేదోడువాదోడిగా నిలుస్తూ కష్టపడి చదివి పది పరీక్షల్లో జిల్లాలో ర్యాంకర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా చరణ్‌తేజను స్థానికులు అభినందించారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

చింతూరు: చిరు వ్యాపారాల ద్వారా పేదలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని, దీని కోసం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలను అందచేస్తోందని ఎంపీడీవో వెంకటరత్నం అన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాంలో భాగంగా రుణాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లతో కలసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారాలతో పాటు చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షలు రుణంగా ఇస్తారన్నారు. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ పోను మిగతాది బ్యాంకులు రుణంగా అందిస్తాయన్నారు. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, రుణాలు తీసుకున్న అభ్యర్థులు సకాలంలో రుణాలు చెల్లించాలని సూచించారు. ఎస్‌బీఐ మేనేజర్ ఎండీ రబ్బానీ, ఏపీజీవీబీ మేనేజర్ బీరబోయిన వినోద్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సోమినాయుడు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకు అధికారులు

తాగునీటి పథకం ప్రారంభం



తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సన్యాసిదొర

జి.మాడుగుల: పెదలువ్వాసింగి పంచాయతీ ఎర్రగొప్ప గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని శనివారం ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మికు స్థానికుల వినతి మేరకు ఈ పథకానికి రూ.2.50లక్షలు నిధులు మంజూరుకు కృషి చేసినట్టు ఆయన చెప్పారు. మాజీ సర్పంచ్ పండుదొర, వార్డు సభ్యుడు చంద్రమ్మ, సంగర్భ కన్వీనర్ సూర్యప్రకాష్ నాయుడు, సచివాలయ కన్వీనర్లు రమణబాబు, పండుదొర, బంగార్రాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల్, కొండబాబు, అబ్బాయిదొర పాల్గొన్నారు

పూర్వ ప్రాథమిక విద్యతో చిన్నారుల భవితకు పునాది





కొసోంగుడ, చవిటిదిబ్బలులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

డుంబ్రిగుడ: కించుమండ పంచాయతీ కొసోంగుడ అంగన్‌వాడీ సెంటర్ పరిధిలో శనివారం జన్ భాగీదరీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం విలియం కేరీ మాట్లాడుతూ జన్ భాగీదరీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్య వారి భవితకు గట్టి పునాదిగా నిలుస్తోందన్నారు.
వై.రామవరం: చవిటిదిబ్బలు గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం జనభాగీదారి కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ .బాలత్రిపురసుందరి, సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

సూక్ష్మ సేద్యంతో అధిక దిగుబడులు

పాడేరురూరల్: జిల్లాలో నీటి ఎద్దడి అధికంగా ఉండడంతో తక్కువ నీటిని ఉపయోగించి, ఎక్కువ దిగుబడులు సాధించేందుకు, సూక్ష్మ కేంద్రం ఉపయోగించాలని, మైక్రో ఇరిగేషన్ డైరెక్టర్ రమేష్‌కుమార్‌రావు శనివారం తెలిపారు. వ్యవసాయ ఉద్యాన పంటలు సాగు చేయడంలో సంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన సూక్ష్మ సేద్యం పరిసరాలను ప్రభుత్వం రాయితీతో అందించి, రైతులకు అండగా నిలుస్తుంది తెలిపారు. ప్రతి రైతు దీనిని స్వదినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ యంత్రాలు కోసం రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు.

జేవీకే కిట్‌ల పంపిణీ



దేవీపట్నంలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సత్యవేణి తదితరులు

దేవీపట్నం: మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి అందజేశారు. హెచ్‌ఎం ముత్యాలరావు, నాయకులు కందుల బాబ్జి, గారపాటి మురళీకృష్ణ, కట్టా సత్యనారాయణ, కారం కృష్ణబాబు, కోసు లక్ష్మణ్, గొర్రిల శ్రీను, కాలచర్ల రవి, బండారు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
వై.రామవరం: పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొని 500 మంది విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేశారు. నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, మంచినీళ్ళ నారాయణరావు, పల్లాల తమ్మిరెడ్డి పాల్గొన్నారు.
జి.మాడుగుల: నుర్మతిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్‌లను హెచ్‌ఎం అంబిడి శ్యామ్‌సుందరం పంపిణీ చేశారు.



పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ స్కూల్‌లో కిట్లను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు



నుర్మతి పాఠశాలలో విద్యార్థులకు కిట్‌లను అందజేస్తున్న హెచ్‌ఎం శ్యామ్‌సుందరం



జర్రెలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాగ్యవతి,ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్రెల పంచాయతీ కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు సర్పంచ్ నాయకం భాగ్యవతి చేతుల మీదగా జగనన్న విద్యా కానుక కిట్లును పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు తిరుపతిరావు,విద్యా కమిటీ చైర్మన్ గాసిరాం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు వినతి



ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ: అరకులోయలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. అరకులోయలో శనివారం పర్యటించిన ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. పాడేరులో మెడికల్ కళాశాల నిర్మిస్తుండడంతో వైద్య విద్యను అందుబాటులోకి తెస్తున్నారని, అరకులోయలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే గిరిజన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లే సమస్య ఉండదని వివరించారు. దీనిపై స్పందించిన డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ అరకులోయలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు అంశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

మృతుడి కుటుంబానికి సాయం

అనంతగిరి: పెదబిడ్డ పంచాయతీ చిమిటి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిరగం రాంనాయుడు, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, నాయకులు శనివారం మృతుడు కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. పార్టీ తరపున అండగా ఉంటామని ఆనంద్ హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ఆర్థిక సాయం చేశారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్

గుండెపోటుతో డిప్యూటీ రేంజర్ కవిరాజు మృతి

చింతూరు: ఎటపాక మండలం నల్లకుంట అటవీశాఖ డిప్యూటీ రేంజర్ పాగా కవిరాజు (49) గుండెపోటుతో శనివారం రాజమహేంద్రవరం ఆస్పత్రిలో మృతిచెందారు. వీఆర్‌పురానికి చెందిన కవిరాజు అటవీశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం డిప్యూటీ రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అనారోగ్యంగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆయనను శుక్రవారం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతిపట్ల తోటి ఉద్యోగులతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కవిరాజు మృతదేహాన్ని ఆయన స్వగ్రామం వీఆర్‌పురంలో డీఎఫ్‌వో పుష్పసౌజన్య, నెల్లిపాక రేంజ్ అధికారి సత్యనారాయణ మూర్తి, చింతూరు రేంజ్ అధికారి మోహినీ విజయలక్ష్మి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం అటవీశాఖ తరపున రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందించినట్లు రేంజ్ అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు.



కవిరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీఎఫ్‌వో పుష్పసౌజన్య (ఇన్‌సెట్) కవిరాజు (ఫైల్)

బాధితులకు పరిహారం అందేలా చర్యలు





కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి వినతిపత్రాలు ఇస్తున్న ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: మండలంలోని ఎం.భీమవరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని, త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి హామీ ఇచ్చారని ఎంపీపీ బడుగు రమేష్ చెప్పారు. ఇటీవల ఎం.భీమవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పేద కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ పాడేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ మాధవరావు తదితరులు శనివారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని ఎంపీపీ చెప్పారు.

'సాగీ గ్రామం'గా జి.మాడుగుల ఎంపిక

జి.మాడుగుల: మండలంలో జి.మాడుగుల గ్రామాన్ని సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన(ఎస్‌ఏజీవై)ద్వారా ఎంపికైనట్టు ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023–2024 సంవత్సరంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి జి.మాడుగులను సాగీ గ్రామంగా ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. గ్రామంలో అత్యవసర పనులు గుర్తించారు. గ్రామంలో అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఏవో పాత్రుడు, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, ఏటీడబ్ల్యువో తిరుపాల్, సీడీపీవో సువర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శిలు, వివిధ శాఖల అధికార్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలోని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. గుమ్మకోట గ్రామానికి చెందిన పెరుమాల లక్ష్మణ్‌రావు(35) ఆస్పత్రి పనినిమిత్తం ద్విచక్రవాహనంపై ఎస్.కోట వెళ్లి తిరిగివస్తుండగా, చిలకలగెడ్డ గ్రామ సమీపంలోని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలోని పెరుమాల లక్ష్మణ్‌రావు కుడికాలు విరిగిపోయింది. స్థానికులు సాయంతో 108 వాహనంలోని ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.



గాయపడిన లక్ష్మణరావు